ప్రజాశక్తి

శనివారం 27 జులై 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

సాయం కొరవడి సాగు భారం..



- పల్నాడులో 1.40 లక్షల మందికి పైగా కౌలు రైతులు
- సిసిఆర్‌సి కార్డుల లక్ష్యం 65 వేలే
- ఇప్పటికీ 20-25 వేల కార్డులే మంజూరు
- పంట రుణాల మంజూరూ అంతంతమాత్రమే

ప్రజాశక్తి పల్నాడు జిల్లా

పంటల సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలు రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. విత్తనాలు, ఎరువుల రాయితీపై, పంట రుణాల మంజూరులో కనీస సాయమైన వీరికి దక్కడం లేదు. సాగులో 75 శాతం వరకూ కౌలురైతులే చేస్తుండడంతోపాటు వ్యవసాయంలో అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలోనూ కౌల్దార్లే 75 శాతానికి పైగా ఉన్నారు. ఏటేటా పెరుగుతున్న సాగు ఖర్చులకు పంటలకు దక్కుతున్న మద్దతు ధరకు పొంతన లేకపోవడం కౌలురైతులను నష్టాల్లోకి నెడుతోంది.

పల్నాడు జిల్లాలో 1.40 లక్షల మందికి పైగా కౌలు రైతులు ఉంటే 65 వేల సిసిఆర్‌సి కార్డులు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటి వరకు 20 వేలకు పైగా కార్డులు మంజూరు చేశారు. గతేడాది 50 వేల సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేయగా వీటిల్లోనూ బోగస్ కార్డులే ఎక్కువనే విమర్శలున్నాయి. అప్పటి అధికార పార్టీ అయిన వైసిపికి చెందినవారు వక్రమార్గంలో కార్డులు పుట్టించుకుని రాయితీలు, రుణాలు దిగమింగిన ఘటనలు వెలుగు చూశాయి. రిజర్వ్ బ్యాంకు నిబంధన ప్రకారం సిసిఆర్‌సి కార్డు పొందిన కౌలు రైతుకి ఎటువంటి హామీ లేకుండా రూ.1.60 లక్షలు రుణం ఇవ్వాల్సి ఉండగా ఆ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. గతేడాది 4500 మంది కౌలురైతులకు రూ.16 కోట్ల మాత్రమే రుణాలు మంజూరు చేశారు.

రాష్ట్రంలో ఇటీవల అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు వర్తింప చేస్తారా లేదా అనేది ఇంతవరకు ప్రకటించిన దాఖలాలు లేకపోవడంతో కౌలు రైతులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో సాగు చేసేందుకు నిరాశక్తి చూపుతున్నారు. అర్హులైన కౌలు రైతులకు సిసిఆర్సి కార్డు పొందేందుకు అడ్డంకిగా ఉన్న 2019 పంట సాగుదారుహక్కు చట్టాన్ని రద్దు చేయడం ద్వారా లబ్ధి చేకూరే అవకాశం ఉన్నా ఆ దిశగా చర్యలు లేవు. కనీసం భూ యజమానులకు అవగాహన కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదు. 2011 భూ అధికృత సాగు చట్టం ప్రకారం గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించి సిసిఆర్సి కార్డులు ఇవ్వాలనే కౌలురైతులు, సంఘాల డిమాండ్‌ను ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయి. కౌలు రైతులకు రుణాలు ఇచ్చేటప్పుడు భూ యజమాని సంతకం పెట్టాలన్న నిబంధనను ఎత్తివేయాలని రైతు సంఘాలు ఎన్నో ఏళ్ల నుండి పోరాటం చేస్తున్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్న నేపథ్యంలో కౌలు రైతును కూడా సాగు చేసేందుకు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. భూమిలేని ప్రతి కౌలు రైతుకి సిసిఆర్సి కార్డు మంజూరు రుణాలు అన్నదాత సుఖీభవ పథకం కింద ఆర్థిక సాయం ఉచిత పంటల బీమా పరిహారం ఈ-క్రాప్ గతంలో మాదిరి కులాల వారీగా కాకుండా భూమిలేని కౌలు రైతులను గుర్తించి రుణాలు ఇవ్వాలి ఇవ్వడం ద్వారా ప్రోత్సహించినట్లు ఉంటుంది. రెవిన్యూ, వ్యవసాయ, బ్యాంక్ అధికారులతో కౌలు రైతు సంఘాలను ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి అర్హులైన ప్రతి కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని రైతు, కౌలురైతు సంఘాలు కోరుతున్నాయి.

అమెరికా నుంచి తెనాలికి రవితేజ మృతదేహం



రవితేజ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

ప్రజాశక్తి తెనాలి

ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికా వెళ్లి ప్రమాదవశాత్తు అక్కడ మృతి చెందిన తాడిబోయిన రవితేజ (28) మృతదేహం ఎట్టకేలకు శుక్రవారం తెనాలి చేరింది. ఐతానగర్‌కు చెందిన రవితేజ ఎంఎస్ చదివేందుకు గతేడాది ఆగస్టులో అమెరికా వెళ్లాడు. ఈనెల 18న మిత్రులతో కలిసి స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లి దానిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. రవితేజ తండ్రి గతంలోనే మృతి చెందగా తల్లి జయలక్ష్మి పోషణలో కుటుంబం నడుస్తోంది. ఉన్నత విద్యతో ప్రయోజకుడై తిరిగి వస్తాడని ఎదురు చూసిన ఆ తల్లి.. కుమారుడి మరణవార్త విని కనీసం కడసారి చూపుకైనా మృతదేహాన్ని తెప్పించాలని ప్రజా ప్రతినిధులను, అధికారులను వేడుకున్నారు. వారి చొరవతో రవితేజ మృతదేహం విమానంలో హైదరాబాద్‌కు, అక్కడి నుంచి అంబులెన్స్‌లో తెనాలికి చేరింది. మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున రోధించారు. మిత్రులు శ్రేయోభిలాషులు రవితేజ మృదేహాన్ని భారీ ఊరేగింపుతో తీసుకెళ్లారు. అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదిలా ఉంటే ఐతానగర్‌కు చెందిన జెట్టి హారిక(25) కూడా అమెరికాలో చదువుతూ అక్కడ ఈనెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆమె మృతదేహం తెనాలికి శనివారం చేరనుందని సమాచారం.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుబ్బరావమ్మ, వై నేతాజీ, ఇతర నాయకులు

ఐసిడిఎస్‌కు నిధులు కోత తగదు

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర బడ్జెట్‌లో ఐసిడిఎస్‌కు నిధులు తగ్గించి, ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ అన్నారు. ఇటీవల అంగన్‌వాడీలు చేపట్టిన 42రోజు సమ్మెకు సంబంధించిన సమాచారంతో రూపొందించిన పుస్తకాన్ని శుక్రవారం పాతగుంటూరులోని సిఐటియు కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఎవిఎన్ కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుబ్బరావమ్మ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఐసిడిఎస్‌కు నిధులు కోతను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆగస్టు మొదటి వారంలో జరిగే నిరసన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమ్మె కాలంలో అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. జులైలో అంగన్వాడీ యూనియన్ నాయకత్వంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి వేతనాల పెంపు విషయంపై చర్చిస్తామని ▶ 2లో



నాగిరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వి.శ్రీనివాసరావు తదితరుల

పేదల కోసం బతికిన నాగిరెడ్డి

- నివాళులర్పించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు
- కొల్లిపరలో ముగిసిన అంత్యక్రియలు

వార్త మెయిన్‌పేజీలో

ఇసుక లోడింగ్‌కు మాత్రమే నగదు వసూలు : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ఉచితంగా ఇసుకను సరఫరాలో భాగంగా కేవలం లోడింగ్ (అపరేషన్)కు మాత్రమే ప్రభుత్వం నగదు వసూలు చేస్తుందనే అంశాన్ని ప్రజలకు అవగాహన కలిగేలా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. వెలగపూడి సచివాలయం నుంచి ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా ఇసుక ▶ 2లో

ర్యాగింగ్‌పై కఠిన చర్యలు

ప్రజలను రెచ్చగొడితే ఉపేక్షించం

పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావు 2 లో

రూ.3.36 లక్షల పురుగు మందుల సీజ్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సూర్యదేవరపేట, ఏటుకూరు రోడ్డులోని పురుగుమందుల గిడ్డంగిలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయాధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించి, రూ.3.36 లక్షల విలువైన పురుగు మందులు అమ్మకాలు నిలిపివేశారు. జిఎన్‌పి ఆగ్రోసైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి చెందిన కూల్ స్టార్ అనే పురుగు మందును స్టాక్ బోర్డులో, స్టాక్ రిజిస్టర్‌లో వివరాలు సరిగా నమోదు చేయనందున వంద లీటర్ల పురుగుమందు విక్రయాలు నిలిపివేశారు. తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయాధికారి కె.రమణకుమార్, అర్బన్ వ్యవసాయాధికారులు బి.గౌతంప్రసన్న సిబ్బంది పాల్గొన్నారు.

గదులకు తలుపులు కూడా లేవండీ...

అధికారి ఎదుట ఎస్సీ హాస్టల్ విద్యార్థినుల ఆవేదన 2 లో





నివాళులర్పిస్తున్న గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి

కార్గిల్ యుద్ధ అమరవీరులకు ఘన నివాళులు

వార్తలు లోపలి పేజీలో

విద్య, వైద్యానికి బడ్జెట్‌లో కోత తగదు

ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా ప్లీనంలో సిహెచ్ కుమార్ 8 లో

పాఠశాలలకు ఉపాధ్యాయుల కోసం యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ నాయకులు ఎంఇఒలు సిహెచ్ రమాదేవి, లీలారాణికి శుక్రవారం విన్నవించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు వెంకట నారాయన మాట్లాడుతూ మండలంలోని పాతమల్లాయపాలెం జెడ్‌పి పాఠశాలకు భౌతికశాస్త్రం టీచర్‌ను వంగిపురం జెడ్‌పి పాఠశాలకు సామాన్య శాస్త్రం టీచర్‌ను నియమించాలని కోరారు. తుమ్మలపాలెం ఎంపియుపిఎస్ పాఠశాలకు ముగ్గురు ఉపాధ్యాయులు అవసరమన్నారు. ఉపాధ్యాయులు సర్వీస్ రిజిస్టర్లను అప్‌డేట్ చేయాలని, 2022లో పెట్టిన ఎస్ఎల్ బిల్ వివరాలు తెలపాలని కోరారు. టిడిఎస్‌లో జరిగిన పొరపాట్లను సరిచేయాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జి.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఆడిట్ కమిటి సభ్యులు కె.ప్రేమ్ కుమార్, నాయకులు షకీలాబేగం, కె.మౌలాలి, జి.రవికుమార్, ఎన్.అంకమ్మరావు, టి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఐసిడిఎస్‌కు నిధులు కోత తగదు

(మొదటి పేజీ తరువాయి)

గతంలో రాతపూర్వక హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు, ఇతర స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులను నిలిపివేయాలని, లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజీ మాట్లాడుతూ అంగన్‌వాడీ హెల్పర్లకు ప్రమోషన్లు పెండింగ్లో ఉన్నాయని వాటిని తక్షణమే పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఉపాధ్యక్షులు సుకన్య, ప్రేమలత, విజయ్ కుమారి పాల్గొన్నారు.

ఇసుక లోడింగ్‌కు మాత్రమే నగదు వసూలు : కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి)

సరఫరాపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సమీక్షించారు. కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ, జేసీ భార్గవ్ తేజ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ స్టాక్‌యార్డుల నుంచి ఇసుకను వినియోగదారులకు సక్రమంగా సరఫరా అయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో కృష్ణానదిలో రాయపూడి, బోరుపాలెం వద్ద ఇసుక డీసిల్టింగ్ అనుమతికి తనిఖీ నివేదికతో తదుపరి జరిగే జిల్లా స్థాయి ఇసుక కమిటీకి ప్రతిపాదన అందించాలని చెప్పారు. ఓపెన్ రీచ్‌లలో ఇసుక తవ్వకాల అనుమతుల ప్రతిపాదనల కోసం సంబంధిత శాఖల అధికారులతో సంయుక్త తనిఖీకి నివేదిక అందించాలన్నారు. బోట్స్‌మెన్ సోసైటీ ద్వారా ఇసుక తవ్వకాల టెండరుకు సాంకేతిక, ఫైనాన్స్, ధర నిర్దేశానికి సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుంటూ మైనింగ్ అధికారులు డ్రాఫ్ట్ నివేదిక సిద్ధం చేయాలన్నారు. ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని, లోడింగ్ చార్జీలు, ప్రభుత్వం నిర్దేశించిన రవాణా చార్జీలను స్టాక్ యార్డుల వద్ద వినియోగదారులకు అర్థమయ్యేలా వివరంగా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద వాహనాలు ఎక్కువ సేపు వేచి ఉండకుండా సత్వరమే లోడింగ్ జరిగేలా చూడాలని చెప్పారు. వాహనాల యాజమాన్యలతో మాట్లాడి వినియోగదారులకు ఇబ్బంది లేకుండా వెయింటింగ్ చార్జీల ధరల నిర్దేశించేందుకు రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డీవో శ్రీకర్, జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర

ఉచిత ఇసుక విక్రయాలు పారదర్శకంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవతేజ అన్నారు. మండల పరిధిలోని మున్నంగి, కొల్లిపర ఇసుక నిల్వ కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఆన్‌లైన్ నగదు చెల్లింపులు, బిల్లుల నమోదు రికార్డులను తనిఖీ చేశారు. ఇసుక కొనుగోలులో స్థానిక వాహనాలకు ప్రాధాన్యమివ్వాలని కొందరు కోరగా ఈ అంశాన్ని జెసి తిరస్కరించారు. ఇసుక అక్రమ తరలింపులకు పాల్పడితే కట్టిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎపిఎం ప్రియదర్శిని, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌పై కఠిన చర్యలు : పల్నాడు ఎస్పీ



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ర్యాగింగ్ - మాదకద్రవ్య రహిత జిల్లాగా పల్నాడును తీర్చిదిద్దడంలో పోలీసు శాఖ అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జమీందారు ఫంక్షన్ హాల్‌లో పల్నాడు జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాల యాజమాన్యాలతో యాంటీ ర్యాగింగ్-యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వివిధ పాఠశాలలు కళాశాలకు చెందిన 200 మంది పాల్గొనగా ఎస్పీ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడినా, ర్యాగింగ్‌ను ప్రోత్సహించినా, మాదక ద్రవ్యాలను వినియోగించినా, సరఫరా చేసిన ఉపేక్షించేది లేదన్నారు. విద్యాసంస్థలో ర్యాగింగ్ లేకుండా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ర్యాగింగ్ చట్టాల గురించి వివరించాలని చెప్పారు. అందరికీ కనిపించేలా ర్యాగింగ్ చట్టాల వాల్‌పోస్టర్లను ప్రచురించాలని సూచించారు. యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, సరఫరాపై నిఘా ఉంచాలన్నారు. ఈ మధ్య కాలంలో జరిగిన ఘటనలపై వెంటనే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి అరెస్టులు చేశామని, ఇంకా అరెస్టులు కావాల్సిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు. ర్యాగింగ్, మాదకద్రవ్యాలు గంజాయి సంబంధించి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలపాలన్నారు. ప్రజలను రెచ్చగొట్టి అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించబోమని చెప్పారు.

గదులకు తలుపులు కూడా లేవండీ...

ప్రజాశక్తి దుగ్గిరాల

బాత్రూంలకు, మేముండే గదులకు తలుపుల్లేవు సార్.. మంచినీరు లేదండీ... పొద్దాక కోతులు వస్తున్నాయి.. భయమేస్తోంది.. అంటూ స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థులు సాంఘిక సంక్షేమ శాఖ డిడి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి అయిన డి.మధుసూదన్‌రావు ఎదుట వాపోయారు. మండల కేంద్రమైన దుగ్గిరాలలో ప్రత్యేకాధికారి శుక్రవారం పర్యటించారు. బాలికల హైస్కూల్, అంగన్వాడి కేంద్రం, ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లల చదువు పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని వార్డెన్‌ను ఆదేశించారు. హాస్టల్ మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు చేపడతామన్నారు. అంతకుముందు మండల స్థాయి అధికారులతో కలిసి ఎంపిడిఒ కార్యాలయంలో సమీక్షించారు. పారిశుధ్యం నిర్వహణపై అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.భార్గవి, సూపరింటెండెంట్ డి.వీరయ్య, గ్రామ కార్యదర్శి ఎం.శరత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పేస్ క్విజ్‌లో బాసర విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ -షార్ ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో నిర్వహించిన స్పేస్ ఎగ్జిబిషన్ సందర్భంగా జరిగిన స్పేస్ క్విజ్‌లో బాసర కాన్సెప్ట్ స్కూల్, నల్లపాడు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని బాసరా విద్యాసంస్థల ఛైర్మన్ సాదినేని మురళీమోహన్ తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు ఎస్.కె.సాధిక మొదటి స్థానం, ఎస్.కె.సమీర్ రెండో స్థానం సాధించినట్లు చెప్పారు. ఆయా విద్యార్థులను మురళీమోహన్, డైరెక్టర్ సాదినేని రాధా అభినందనలు తెలిపారు.

డిగ్రీ ఫలితాల్లో 'కృష్ణవేణి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గురువారం విడుదల చేసిన డిగ్రీ బీఎస్సీ, బీకాం కంప్యూటర్స్ మొదటి ఏడాది డిగ్రీ 2వ సెమిస్టర్ ఫలితాల్లో కృష్ణవేణి కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయి మార్కులు సాధించడంతోపాటు 100 శాతం ఉత్తీర్ణత సాధించి పల్నాడు జిల్లా మొదటి స్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. తమ విద్యార్థినిలు కె.తేజస్వి బిసిఏలో 850 మార్కులకు గాను 802, ఎస్.అలేఖ్య 799, ఎం.వసంతభాయ్ 788, బి.ఎస్.సి కంప్యూటర్‌లో కె.స్వాతి 850 మార్కులకుగాను 786, టి.నాగలక్ష్మి 784, టి.లక్ష్మీ చైతన్య 782, టి.అమృత 783, టి.హరిప్రియ 782, పి.శ్రీకన్య 781, ఎ.ధోని రాఘమయి 731 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య విద్యార్థులను అభినందించారు. తమ కళాశాలలో అనుభవం కలిగిన అధ్యాపకులచే విద్యాబోధన నేపథ్యంలో తమ విద్యార్థులు యూనివర్సిటీ మార్కులు సాధించి తమ కళాశాలకు గుర్తింపు తెచ్చారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ బాలు, సిబ్బంది మల్లారెడ్డి, తిరుపతిరావు, ఎమ్‌డిఎస్ సాయికుమార్, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు



నీరు, పారిశుధ్యంపై సమీక్ష

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నీరు, పారిశుధ్యంపై వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఎంపిడిఒ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పారిశుధ్యం ప్రాధాన్యత, నిర్వహణ తీరు, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అంశాలపై వివరించారు. వాటర్ ఎయిడ్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ సురేష్ మాట్లాడుతు గ్రామస్థాయిలో పనిచేసే జలజీవన్ మిషన్, స్వచ్ఛభారత్ మిషన్, నీరు, పారిశుధ్య కమిటీలు, గ్రామ జల సంఘాలు, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగలపై అవగాహన కల్పించారు. ఇఒపిఆర్‌డి షేక్ ఖాజావలి, గొట్టిపాడు సర్పంచ్ మరియరాణి, పాత మల్లయ్యపాలెం పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి వాటర్ ఎయిడ్ ప్రతినిధులు సాయి, సునీల్ కుమార్, సత్యవాణి, లక్ష్మి, వేణు పాల్గొన్నారు. అనంతరం శిక్షణ దీపికను ఎంపిడిఒ ఆవిష్కరించారు.

కెఎల్‌యును సందర్శించిన ఆస్ట్రేలియా యూనివర్సిటీ ప్రతినిధులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఆస్ట్రేలియాలోని సిడ్నీలోని న్యూకాజిల్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం శుక్రవారం కెఎల్ యూనివర్సిటీని సందర్శించింది. డాక్టర్ ఫ్రాన్సెస్కో పౌలోచ్చి ఆధ్వర్యంలో పర్యటించిన ఈ బృందం ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యనభ్యసించడానికి ఉన్న అవకాశాలను వివరించారు. విదేశీ సంబంధాల డీన్ డాక్టర్ కిషోర్‌బాబు మాట్లాడుతూ కెఎల్ యూనివర్శిటీ పరిశోధనల కోసం విద్యార్థుల రాక పోకల ద్వారా వారి విజ్ఞాన పరమైన ఆలోచనలను విస్తృత పరిచేందుకుగాను ప్రపంచంలోని నలుమూలలా ఉన్న విశ్వ విద్యాలయాలతో ఒప్పందాలను కలిగివుందన్నారు. ఒక సెమిస్టర్ లేదా ఒక సంవత్సరం గాని రెండు సంవత్సరాల పాటు వేరే దేశాలలో చదువుకునే ఏర్పాట్లు ఈ ఒప్పందాలలో భాగమని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్సులర్ డాక్టర్ సారథివర్మ, ప్రో విసిలు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరా

ప్రజాశక్తి - చేబ్రోలు

కుటుంబంలోని ప్రతి వ్యక్తికి రోజుకు 55 లీటర్ల త్రాగు నీటిని ఫంక్షనల్ హౌస్ హోల్డ్ టాప్ కనెక్షన్ ద్వారా అందిచడం జల జీవన్ మిషన్ ప్రధాన ఉద్దేశమని ఇఒపిఆర్‌డి జి.శ్రీనివాసరావు చెప్పారు. గ్రామాల్లో ఇప్పటివరకు పైప్ లైన్ లేని ప్రాంతాలు, నివాసాలకు దూరంగా వున్న గృహాలు, ప్రభుత్వ సంస్థలు, వ్యక్తిగత మరుగుదొడ్లు లేని కుటుంబాలను, గుర్తించెందుకే ప్రత్యేక గ్రామసభలు నిర్వహించామన్నారు. ఈ మేరకు శుక్రవారం గొడవర్రు, గుండవరం, చేబ్రోలు, సుద్దపల్లి, వడ్లమూడి వేజెండ్ల పంచాయితీలలో గ్రామ సభలు నిర్వహించారు. నూతనంగా నిర్మితమైన కాలనీలకూ నీరందిస్తామన్నారు. ప్రతి కుటుంబమూ మరుగుదొడ్డిని నిర్మించుకోవాలన్నారు. పారిశుధ్య సిబ్బంది తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. చేబ్రోలు సభలో సర్పంచి పచ్చిగండ్ల వినీతారాణి మాట్లాడుతూ గ్రామంలో చిట్టచివరి ఇంటిలో నివసించే వారికీ రక్షితనీటిని అందిస్తామన్నారు. చేబ్రోలు పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, స్వచ్ఛభారత్ మిషన్ మండల కో-ఆర్డినేటర్ జి.ప్రసాదరావు పాల్గొన్నారు.

విద్యార్థుల హాస్టల్ భవనం కోసం ఎంపీ వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా మాచర్లలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో విద్యార్థులకు వసతి సదుపాయం కల్పించేందుకు మాచర్ల పట్టణంలో ఖాళీగా ఉన్న భారత ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని భవనాన్ని అద్దె ప్రాతిపదికన ఇవ్వాలని కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్‌ను టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో కేంద్రమంత్రికి వినతి పత్రాన్ని ఇచ్చారు. హాస్టల్ సౌకర్యం కోసం ప్రభుత్వ భవనం లేకపోవడంతో వసతి గృహాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మాచర్ల పట్టణంలోని వివిధ కళాశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన నిరుపేద బాలికలు విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు భవనాల కొరత తీవ్రంగా ఉందన్నారు. పట్టణంలో భారత ప్రసార మంత్రిత్వ శాఖ వారి సిబ్బంది కోసం నిర్మించిన 20 గదుల భవనాన్ని లీజుకు ఇవ్వాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపి తెలిపారు.

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్లు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్‌నగర్ డ్రైవర్స్‌కాలనీలో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ట్రైనీ కలెక్టర్లు ఆరుగురు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవల గురించి రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ల్యాబరేటరీలో రోగులకు అందుతున్న పరీక్షలు, అందుబాటులో ఉన్న మందులు గురించి తెలుసుకున్నారు. డాక్టర్, సూపర్‌వైజర్, ఆసుపత్రి సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశాలు జాబ్‌చార్టు పరిశీలించారు. ఆసుపత్రిలో నిత్యం ఏ విధంగా సేవలందిస్తున్నారు అని ఆసుపత్రికి వచ్చిన రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందించే జాతీయ కార్యక్రమాల నిర్వహణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో అనుసంధానమై ప్రజలకు ఏ విధంగా సేవలందించాలో వివరించారు. ఆసుపత్రిలో గడిపినంత సేపు సిబ్బందితో కుతూహలంగా ప్రశ్నలను వేస్తూ ఉత్సాహంగా గడిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, సిబ్బంది, రాష్ట్ర పర్యవేక్షణాధికారి డాక్టర్ రమాదేవి సేవలందించడాన్ని అభినందించారు. డాక్టర్ల బృందంలో రాష్ట్ర ఆరోగ్యశ్రీ సిఇఒ డాక్టర్ లక్ష్మయ్య, డాక్టర్ రమాదేవి, డాక్టర్ మానస, శ్రీమన్నారాయణ, సిహెచ్ఒ గురుకుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు, అర్బన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో అమరావతి ఐకాన్‌లో చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ తెలిపారు. ఎంటిఎంసి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి అధ్యక్షతన తాడేపల్లి బైపాస్‌రోడ్డులోని బాలోత్సవం ఉపాధ్యక్షులు జిఎస్‌ఆర్ మోహనరావు కార్యాలయంలో శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఎంటిఎంసి బాలోత్సవం ఇప్పటికే అనేక బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఆగస్టు పదో తేదీన సబ్ జూనియర్స్ (3, 4, 5 తరగతులు) అంశం జెండా వందనం, జూనియర్స్ (6, 7 తరగుతులు) అంశం మీ కిష్టమైన స్వాతంత్ర్య సమరయోధుడు, సీనియర్స్ (8, 9, 10 తరగతులు) అంశం స్వాతంత్ర్య ఉద్యమంలో ఏదైనా ఓ ఘట్టం మూడు విభాగాల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. సాయంత్రం 2 నుంచి 4 గంటల వరకు అమరావతి ఐకాన్ అపార్టుమెంట్ ఫంక్షన్ హాల్లో జరుగుతాయని వెల్లడించారు. సాయంత్రం ఐదు గంటలకు విజేతలకు బహుమతులు, మెమొంటోలు అందజేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఆగస్టు ఏడో తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పోటీ జరిగే కేంద్రంలో డ్రాయింగ్ షీట్ మాత్రమే అందించబడుతుందని తెలిపారు. పేర్లు నమోదుకు ఆర్.నాగరాజు, ఫోన్ నెంబర్ 949009955కు సంప్రదించాలన్నారు. ఎంటిఎంసి బాలోత్సవం ఉపాధ్యక్షులు జిఎస్‌ఆర్ మోహనరావు మాట్లాడుతూ పిల్లల్లో స్వాతంత్ర్య పోరాటం గొప్పతనం గురించి తెలియజేయడానికి, పోరాట స్ఫూర్తిని వారిలో నింపడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో బాలోత్సవం నిర్వాహకులు విశ్రాంత ఇంజనీర్ శేషయ్య, అమరావతి ఐకాన్ మిత్ర బృందం తరపున యడ్ల బాలకృష్ణ, విశ్రాంత ఎంపిడిఒ ఆదినారాయణ, జెవి రావు, డి.కోదండరామయ్య పాల్గొన్నారు.



పార్శిల్ కార్యాలయాలు, విత్తన దుకాణాల్లో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని రవాణా కార్యాలయాలు, విత్తన దుకాణాలను మండల వ్యవసాయాధికారి టి.శ్రీలత శుక్రవారం తనిఖీ చేశారు. రవాణా కార్యాలయంల్లో బిల్లులు లేకుండా విత్తనాలు, పురుగుమందులు వచ్చిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అనుమతులు లేని విత్తనాలు, పురుగు మందులు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. విత్తనాలను అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని విత్తన దుకాణ యజమానులను హెచ్చరించారు. ఎవరైనా విత్తనాలను ఎక్కువ ధరలకు అమ్మితే మండల వ్యవసాయ అధికారి ఫోన్ : 8331056944కు సంప్రదించాలని సూచించారు.

28 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - నాదెండ్ల

మండంలోని చిరుమామిళ్లలో కమ్యూనిటీ హాలులో అక్రమంగా నిల్వ ఉంచిన 28 బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. బియ్యం నిల్వపై సమాచారం రావడంతో తహశీల్దార్ అష్రపున్నీస బేగం, సివిల్ సప్లయీస్ డీటీ లక్ష్మణరావు అక్కడికి చేరుకున్నారు. కమ్యూనిటీ హాలుకు వేసి ఉన్న తాళాన్ని పగలగొట్టి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసు బందోబస్తు నడుమ దీనిపై విచారణ చేపట్టారు.



చందవరంలో పోలీసుల పహారా

ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలోని సమస్యాత్మక గ్రామలైన కనపర్రు, చందవరం గ్రామాల్లో చిలకలూరిపేట రూరల్ సిఐ, నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట రూరల్ ఎస్ఐలు, సిబ్బంది శుక్రవారం పర్యటించారు. చందవరంలో రెండ్రోజులుగా గొడవలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం దెబ్బతినకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ బలరాంరెడ్డి తెలిపారు.

ఆధార్ కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి పెదకూరపాడు

మండలంలోని లింగంగుంట్లలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంపిడిఒ మల్లేశ్వరి శుక్రవారం తనిఖీ చేశారు.



ప్రజలు ఆధార్ కేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి ఫ్రాన్సిస్, సర్పంచి వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.



వివరాలు నమోదు చేస్తున్న అధికారులు



సేకరించిన మట్టి నమూనాలు

సారం.. పోతున్న పొలం..

- రసాయన ఎరువుల అధిక వినియోగంతో తగ్గుతున్న సూక్ష్మ పోషకాలు
- సహజత్వాన్ని కోల్పోతున్న నేలలు-నష్టపోతున్న రైతులు
- గత ప్రభుత్వం హయాంలో నిలిచిన సూక్ష్మ పోషకాల పంపిణీ
- ఈ ఏడాది 18 వేల భూసార పరీక్షల లక్ష్యం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పశువులు, మేకల ఎరువు, కోళ్ల ఎరువు, కుళ్లిన మొక్కలు ఇలాంటి సేంద్రియ ఎరువులే కాకుండా పంట మార్పిడి విధానం వంటి పద్ధతులు ఒకప్పుడు పంటల సాగులో ప్రధానంగా ఉండేవి. దీంతో సాగు భూముల్లో సేంద్రియ కర్బనం ఉత్పత్తి ఎక్కువగా ఉండేది. కర్బన-నత్రజని 184 శాతంలో సమతుల్యంగా ఉండేవి. జీవ సంబంధమైన వానపాము, సాలె పురుగు, ఆరుద్ర పురుగు, గొల్లభామ, కందిరీగ, తూనిగ, సీతాకోకచిలుక, రైజోబియం బ్యాక్టీరియా తదితర అనేక జీవులు భూసారాన్ని వృద్ధి చేస్తాయి. పంటలను చీడపీడల బారి నుంచి సంరక్షిస్తాయి. అధిక పోషక విలువలతో పంటల దిగుబడి అధికంగా ఉండేది.

కానీ నేటి పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారిపోయాయి. 20వ శతాబ్దంలో వచ్చిన హరిత విప్లవం తర్వాత అధిక దిగుబడే ప్రధాన లక్ష్యంగా రసాయనిక ఎరువుల ప్రాధాన్యత పెరిగింది. దీంతో సేంద్రియ ఎరువుల వాడకం పూర్తిగా తగ్గిపోయింది. మోతాదుకు మించి రసాయనిక ఎరువుల వాడకం పెరగడంతో భూమిలో సేంద్రియ కర్బనం తగ్గిపోయింది. దీంతో పంటల నాణ్యతా దెబ్బతింది. ఈ సమస్యపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూమిలో సూక్ష్మ పోషకాలు అంతరించిపోతే భవిష్యత్తులో వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పల్నాడు జిల్లాలో సాగు భూముల పరిస్థితి

పల్నాడు జిల్లాలో సాగు భూముల్లో నత్రజని తక్కువ నుండి మధ్యస్థంగా ఉందని, లభ్యభాస్వరం అధికంగా ఉందని పొటాషియం మధ్యస్థం నుండి ఎక్కువగా ఉందని, సేంద్రియ కర్బనం తక్కువగా ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. భూమిలో సేంద్రియ కర్బన స్థితి పెంపొందించుకునేందుకు పచ్చిరొట్ట పైర్లు, పశువుల ఎరువులు వినియోగంతో పాటు పచ్చిరొట్ట పంటలు పూత దశలో కలియ దున్నడం ద్వారా సేంద్రియ కర్బన శాతం మెరుగుపడి తద్వారా నత్రజని కూడా పెరుగుతుందని, రైతులు భాస్వరం వంటి ఎరువులు దుక్కిలో వేయాలని, పై పాటుగా వేయాల్సిన అవసరం లేదని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. లభ్య పొటాషియం మధ్యస్థం నుండి ఎక్కువ స్థితిలో ఉందని, పొటాషియం ఎరువులు మొదటి దశ నుండి మరియు పూత దశలో లేక గింజ గట్టి పడే దశలో పొటాషియం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చని అంటున్నారు.

సేంద్రియ సాగుపై అవగాహనా లేమి

పొలాల్లో సేంద్రియ ఎరువుల వాడకంతో పెట్టుబడి ఖర్చులు తగ్గించాలని, ఎరువుల అవశేషాలు లేని నాణ్యమైన పంటలను పండించేలా రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు పూర్తి స్థాయిలో ఫలితాలు రావడం లేదు. పొలంబడి, రైతు చైతన్యయాత్రలు, సాగుకు సమాయత్తం, రైతు భరోసా కేంద్రాల నిర్వహణ, రైతు అవగాహన సదస్సులతో ఆశించిన మేర ఫలితాలు రావడం లేదనే వాదనలున్నాయి. పల్నాడు జిల్లాలో 10 శాతం మంది రైతులు కూడా భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేయడంలేదు. కొంత మంది రైతుల మాత్రమే పశువులు, గొర్రెల ఎరువు, పచ్చిరొట్ట లాంటి సేంద్రియ ఎరువులు వాడుతున్నారు.

రసాయన ఎరువులతో నష్టాలు

మితిమీరిన రసాయన ఎరువుల వాడకం వలన కాలక్రమేణా నేలకు మేలు చేసే సూక్ష్మ జీవులు అంతరించిపోతున్నాయి. తద్వారా నేల సారం కోల్పోయి పంటలకు చీడపీడలు వ్యాపించి, పండే పంటలు సైతం కలుషితంగా మారుతున్నాయి. రైతులు సేంద్రియ ఎరువుల వాడకం తగ్గించి, రసాయన ఎరువుల వాడకం ఇదే మోతాదులో పెంచుకుంటూ పోతే భవిష్యత్తులో భూములు వ్యవసాయానికి పనికి రాకుండా పోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సేంద్రియ ఎరువులతో నేలలు సహజత్వాన్ని కోల్పోకుండా ఉండి నేల ఉత్పాదకతకు కావాల్సిన అనుకూల లక్షణాలు పెరగడం ద్వారా మొక్కకు కావాల్సిన పోషకాలు పుష్కలంగా ఉండి సూక్ష్మ పోషకాల సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుంది. పలురకాల ఎంజైములు, హార్మోన్లు, అమైనో అమ్లాలు తయారై మొక్క ఆరోగ్యానికి తోడ్పడతాయి. తద్వారా నాణ్యమైన అధిక దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

కౌలుగుర్తింపు కార్డు కాలపరిమితి 11 నెలలే

పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి మురళి

ప్రజాశక్తి - అచ్చంపేట

భూ యజమాని హక్కులకు భంగం కలగకుండా 11 నెలల కాల పరిమితితో కౌలుదారులకు గుర్తింపు కార్డులిస్తామని పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి అన్నారు. మండలంలోని కొండూరులో కౌలు రైతులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు జారీ చేస్తామన్నారు. కౌలుకు సాగు చేసే ప్రతిరైతు తప్పనిసరిగా పంట సాగుదారు హక్కు పత్రం తీసుకోవాలని, అందుకుగాను భూ యజమాని ఆధార్, సాగుదారు ఆధార్, మొబైల్ నంబర్‌తో స్థానిక గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్డుల ద్వారా ఈ-క్రాప్ నమోదుకు, పంటలను మద్దతు ధరకు కొనుగోలు



కౌల్దార్లకు గుర్తింపు కార్డు ఇస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

చేయడానికి, పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం వాటిల్లితే పరిహారం, పెట్టుబడి సాయం వంటి ప్రభుత్వ పథకాలు కౌలురైతులకు అందుతాయని వివరించారు. అనంతరం కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు అందించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.వెంకటేశ్వర్లు, వీఆర్వో రాజబాబు, గ్రామ కార్యదర్శి ఉమామహేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ గోవిందరావు

వ్యాధులు, పారిశుద్ధ్య నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పారిశుధ్య నిర్వహణపై సిబ్బందితో మునిసిపల్ కమిషనర్ సిహెచ్.గోవిందరావు శుక్రవారం సమీక్షించారు. కాల్వలు పూడికతీత, సీజనల్ వ్యాధుల నివారణపై యాక్షన్ ప్లాన్ రూపందించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ఆక్రమణలు, ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. చెత సేకరణ, కంపోస్టు ఎరువు తయారీపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సమీక్షలో ఎన్విరాన్మెంట్ ఏఈ జ్యోతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, రమణారావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

పంచాయతీ కార్మికులకు సంవత్సరాలు తరబడి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, బండ్లు రిపేరు చేయటంలో తీవ్ర జాప్యం జరుగుతుందని, అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవట్లేదని యూనియన్ గౌరవాధ్యక్షులు వై.నేతాజీ అన్నారు. శుక్రవారం ఏపీ గ్రామపంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా కమిటీ సమావేశం పాత గుంటూరులోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో నేతాజీ మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు నెలకు రూ.6వేలు వేతనం ఇచ్చి శ్రమదోపిడీ చేస్తున్నారని, జూలైనెల చివరికి వచ్చినా పంచాయతీ అధికారులు టెండర్ నోటీసులు ఉన్నతాధికారులకు పంపించలేదని అన్నారు. నిత్యం మురికి కూపంలో పనిచేసే కార్మికులకు కనీసం మాస్కులు గ్లౌజులు, చెప్పులు కూడా ఇవ్వట్లేదని, దీంతో కార్మికులు అనారోగ్యానికి గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు కనీస వేతనం ఇచ్చి టెండర్ విధానాన్ని రద్దుచేసి కార్మికుల రెగ్యులర్ చేయాలని ఈ సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 10న జరిగే రాష్ట్ర సదస్సులో పంచాయతీ కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. సిఐటియు జిల్లాఅధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, వేతనంతో కూడిన వారాంతపు సెలవులు, క్యాజువల్ లీవులు ఇవ్వాలని, ప్రభుత్వాలు మారినప్పుడల్లా కార్మికులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని అన్నారు. ఈ సమావేశానికి డివి నరసింహారావు అధ్యక్షత వహించగా నాయకులు చింతల శ్రీనివాసరావు, సిహెచ్ రాంబాబు, బి.సంధ్యారాణి, పి.మేనకరావు, ఏ.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు

భవిష్యత్ మెకానికల్, సివిల్ రంగాలదే

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న గోపికృష్ణ

రాబోయే కాలంలో ఆటోమేషన్ రంగంలో మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని షార్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ గ్రూప్ డైరక్టర్ పీ.గోపీక్రిష్ణ అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీకి శుక్రవారం విచ్చేసిన ఆయన మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులకు ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని ఇచ్చారు. గోపికృష్ణ మాట్లాడుతూ మెకట్రానిక్స్, రోబోటిక్స్, స్పేస్‌క్రాఫ్ట్ డిజైన్‌లోని ఉన్నత సాంకేతిక నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. కోర్ ఇంజినీరింగ్, స్పేస్ టెక్నాలజీ రంగాలలోని ఉద్యోగావకాశాలను విద్యార్థులతో పంచుకున్నారు. తయారీ రంగంలో మిగిలిన ప్రపంచ దేశాలు ప్రస్తుతం వెనుకంజలో ఉన్నాయని, మన దేశం అగ్రగామిగా నిలవడానికి ఇదే సరైన సమయం అన్నారు. రాబోయే రోజుల్లో రోబోటిక్స్, ప్రోడక్ట్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్, మెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ కీలకంగా మారనున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆటోమొబైల్స్, వ్యవసాయం, హాస్పిటల్స్, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ అన్ని రంగాలలోనూ రోబోలను వినియోగిస్తారని తెలిపారు. వాహనాలను కూడా రోబోలే నడుపుతాయని పేర్కొన్నారు. ప్రపంచ అవసరాలకు తగ్గట్లు విద్యార్థులు పరిశోధనలకు పూనుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు నలుగురు అంతకు మించి సమూహాలుగా ఏర్పడి నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ వర్సిటీ వీసీ పి.నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

జైన్ హైస్కూల్ డైరెక్టర్ మున్నుకు డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సంగడిగుంటలోని జైన్ హైస్కూల్ అధినేత మహమ్మద్ మున్నుకు అమెరికాకు చెందిన హెచ్ఎస్‌సి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జైన్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ మహమ్మద్ మున్ను మాట్లాడుతూ విద్యారంగంలో తాను చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తించి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ డాక్టరేట్ తనకు మరింత బాధ్యత పెంచిందని రానున్న కాలంలో పేద, మధ్యతరగతి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది వారికి బంగారు బాట వేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు.



డాక్టరేట్ అందుకుంటున్న మున్ను



టాపర్లను అభినందిస్తున్న నందకిషోర్ తదితరులు

సెమిస్టర్ ఫలితాల్లో శ్రీమేధ, కెరీర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల్లో శ్రీమేధ, కెరీర్ డిగ్రీ కాలేజి విద్యార్థులు బి.కాం జనరల్, కంప్యూటర్స్ కోర్సులలో అత్యధిక మార్కులు సాధించారని సంస్థ డైరెక్టర్లు శేషసాయిబాబు, సి.ఎ అన్నానందకిషోర్ తెలిపారు. బి.కాం జనరల్ విభాగంలో 700 మార్కులకుగాను టి.ఒలివ్ గ్లోరియానా 619, ఎస్.కె.సుమయా 612, జె.మౌనిసృజన 599, రితిక కుమారి 584, వి.నరేష్‌కుమార్ 582 మార్కులు సాధించారన్నారు. అలాగే బి.కాం కంప్యూటర్స్‌లో 800 మార్కులకుగాను బి.షారోనికా 714, పి.ఆర్షియా 678, ఎ.మహేశ్వరి 659, ఎన్.స్తుతి హర్షిత 654, ఎస్.కె.కుబాహౌసైన్ 646 మార్కులు సాధించారన్నారు. టాపర్లకు శ్రీమేధ చైర్మన్ అన్నా నందకిషోర్, డైరెక్టర్ లక్ష్మీ అభినందనలు తెలిపారు.

సెయింట్ ఆన్స్ నర్సింగ్ కాలేజీలో అన్నమ్మ పండుగ

ప్రజాశక్తి-గుంటూరు

చౌడవరంలోని సెయింట్ ఆన్స్ నర్సింగ్ కళాశాలలో పునీత అన్నమ్మ పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ రాయన్న గోవింద్, ఫాదర్ ఆరోగ్యస్వామి, ఫాదర్ ఇన్నారెడ్డి, ఫాదర్ జోసఫ్, ఫాదర్ ఆంతోని పాల్గొన్నారు.అలాగే బిఎస్సీ నర్సింగ్ మొదటి సంవత్సరం క్యాపింగ్ సెర్మనీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లీనా విద్యార్థులకు దీపాలను అందించి, నర్సింగ్ వృత్తి ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వైఎస్ఆర్ యూనివర్సిటీ నిర్వహించిన బిఎస్సీ నర్సింగ్ పరీక్షల్లో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు.

ముంపు పొలాల పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి : ఇటీవల కురిసిన వర్షాల వల్ల ముగ్గురోడ్డు సమీపంలో నీట మునిగిన పంట పొలాలను టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు శుక్రవారం రైతులతో కలిసి పరిశీలించారు. పంట పొలాల్లో వర్షం నీరు బయటకు వెళ్లేందుకు వీల్లేకపోవడంతో సకాలంలో పంటలు వేసుకోలేకపోతున్నామని రైతులు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన వెంకట్రావు డిఇతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.వినయ్, హరికృష్ణ, ఎం.అమరారెడ్డి, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తాడేపల్లి అరవింద స్కూల్ వద్ద చెత్తచెదారంతో పేరుకుపోయిన ఆంధ్ర రత్న పంపింగ్ స్కీమ్‌ను పరిశీలించారు.

సిపిఎం నేత నాగిరెడ్డికి అశ్రునివాళి

ప్రజాశక్తి - కొల్లిపర

సిపిఎం నేత గుదిబండి నాగిరెడ్డికి శుక్రవారం పలువురు నాయకులు నివాళులర్పించారు. గురువారం రాత్రి అనారోగ్యంతో కొల్లిపరలోని ఆయన స్వగృహంలో నాగిరెడ్డి కన్నుమూశారు. ఆయనకు ముగ్గురు కుమారులున్నారు. శుక్రవారం అంత్యక్రియలను నిర్వహించారు. ముందుగా నాగిరెడ్డి భౌతికకాయానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, కార్యదర్శి వర్గసభ్యులు డి రమాదేవి, జిల్లా కార్యదర్శి పాశం రామారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె ఉమామహేశ్వరరావు, ధనలక్ష్మీ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై నేతాజీ, ఎన్ భావన్నారాయణ తదితరులు నివాళులర్పించారు. నాగిరెడ్డి భౌతికకాయానికి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రసంగించారు. గుదిబండి నాగిరెడ్డి (85) మరణం సిపిఎం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. అమరులు కోట వెంకటరత్నం ఆదర్శంగా గుది బండినాగిరెడ్డి రాజకీయాల్లోకి వచ్చి తన అన్న వెంకటేశ్వర్ రెడ్డి తమ్ముడు ప్రకాష్ రెడ్డిలతో కలసి ఈ ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కడవరకు కమ్యూనిస్టు ఉద్యమనేతగా నిలిచిన గుదిబండి నాగిరెడ్డి ధన్యజీవి అని అన్నారు అగ్రవర్ణ ధనిక రైతు కుటుంబంలో పుట్టిన గాని కూలి రేట్ల ఉద్యమం తో పాటు దళితులపై దాడి జరిగిన సందర్భంలో కూడా ఆయన వారికి అండగా నిలవడం పార్టీకే గర్వకారణం అన్నారు పార్టీ అభ్యున్నతికి తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు గుడి బండి నాగిరెడ్డి అని కొనియాడారు నివాళులర్పించిన వారిలో నాయకులు ములకా శివసాంబి రెడ్డి, కె వి ప్రసాద్ ఆంజనేయ రెడ్డి తుమ్మపూడి మాజీ సర్పంచ్ విఎన్ ప్రసాద్ ఎం శివకుమారి కోటా చంద్రశేఖర్ షేక్ హుస్సేన్ వలి బొనిగల అగస్టీన్ , మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరాం కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు. శుక్రవారం నిర్వహించిన అంత్యక్రి యల్లో నాయకులు పాల్గొని కన్నీటి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న పాశం రామారావు, వై నేతాజీ తదితరులు



నివాళులర్పిస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తదితరులు



అంత్యక్రియల్లో పాల్గొన్న ధనలక్ష్మి తదితరులు

మాజీ మంత్రి ఆలపాటి నివాళి

సిపిఎం నేత గుదిబండి నాగిరెడ్డి మరణం ఆ పార్టీకి తీరని లోటని టిడిపి నాయకులు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. నాగిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు భీమవరపు కోటిరెడ్డి (లంక) వంగ సాంబిరెడ్డి భీమవరపు చిన్న కోటిరెడ్డి అమృత రాజు శ్రీనివాసరావు గుదిబండి గోవర్ధన్ రెడ్డి , టిడిపి నాయకులు తదితరులు నాగిరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు.

విద్యుత్ లైన్లకు వేలాడుతున్న పరదా తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-తెనాలి



'విద్యుత్ స్తంభానికి వేలాడుతున్న పరదా' శీర్షికన ప్రజాశక్తి దినపత్రిక లో ఈనెల 25న ప్రచురితమైన వార్తకు విద్యుత్ అధికారులు స్పందించారు. పట్టణంలోని ఐతానగర్ లింగరావు సెంటర్లో 54/ఎ4 నంబరు గల విద్యుత్ స్తంబానికి వేలాడుతున్న పరదాను విద్యుత్ సిబ్బంది తొలగించారు. దీంతో ఆ ప్రాంతవాసులు ఊపిరి పీల్చుకున్నాడు. అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



శ్రీనివాసరావుకు అభినందనలు తెలియజేస్తున్న నాయకులు

పల్లా శ్రీనివాసరావుకు టిడిపి నాయకుల అభినందన

ప్రజాశక్తి - మంగళగిరి

టిడిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మంగళగిరి టిడిపి నాయకులు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గా నియమితులైనా గాజువాక నియోజకవర్గం శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావుని కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ రాష్ట్ర పార్టీ అధికారప్రాతినిధి దానబోయిన సుందర్రావు యాదవ్, మంగళగిరి మండల అధ్యక్షులు తోట పార్థసారథి జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు నల్లి బోయిన నాగేశ్వరరావు చాగంటి పూర్ణచంద్రరావు నవులూరు గ్రామ తెలుగుదేశం నాయకులు రుద్రు శ్రీనివాసరావు, షేక్ నజీర్, ఎస్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా దివ్యతేజో మూర్తి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) నూతన ప్రోగ్రాం కోఆర్డినేటర్ గా ఆచార్య వీ. దివ్య తేజో మూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఇంచార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. గంగాధరరావు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంలో ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి .సింహాచలం, ఓఎస్ డి ప్రొఫెసర్ ఆర్విఎస్ఎస్ ఎన్ .రవికుమార్, ప్రొఫెసర్ ఎం. త్రిమూర్తి రావు, రూస కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్. మురళీమోహన్ తదితరులు దివ్య తేజ మూర్తికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన విసి గంగాధర రావుకు ధన్యవాదాలు తెలియజేశారు. చిత్తశుద్ధితో పనిచేసి వర్సిటీకి కీర్తి ప్రతిష్టలు తెచ్చేలా సహకరిస్తానని పేర్కొన్నారు.

న్యాయవాది రేటూరి కిషోర్ కన్నుమూత

ప్రజాశక్తి - మంగళగిరి



మంగళగిరి ప్రముఖ న్యాయవాది రేటూరి కిషోర్ (56) శుక్రవారం కన్నుమూశారు. చెందారు. 1994లో న్యాయవాది గా వృత్తిని చేపట్టిన కిషోర్ ప్రముఖ క్రిమినల్ లాయర్ గా మంగళగిరి నుండి పేరు సంపాది ంచుకున్నారు. మంగళగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా, మంగళగిరి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గాను పనిచేశారు. రెండు రోజులు క్రితం బ్రెయిన్ స్ట్రోక్ కు గురి కాగా మంగళగిరి ఎన్నారై ఆసుపత్రి లో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మతి చెందారు. శనివారం ఉదయం 11 గంటలకు చినకాకాని లోని కిషోర్ నివాసం నుండి అంతిమయాత్ర ప్రారంభమవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

సాంకేతిక నైపుణ్యాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

కేంద్ర మానవవనరుల శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం-2020 అమలు చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్‌లో భాగంగా శుక్రవారం స్థానిక డాక్టర్ మర్రి జెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ రూపంలో తరగతుల నిర్వహించారు. హెచ్‌ఎం కె.సుధ మాట్లాడుతూ విద్యార్థులుకు సాంకేతిక విద్య డిజిటల్ రూపంలో తరగతులలో అందించడం వల్ల వారి మనసులో శాశ్వతంగా గుర్తుండిపోతుందన్నారు. స్క్రీన్‌పై ప్రత్యక్షంగా చూడటం వల్ల విద్యార్థులకి బాగా అర్ధమవుతుందన్నారు. నేటి డిజిటల్ యుగంలో సెల్ఫోన్ ద్వారా పోస్టర్స్, స్టికర్స్ చేయడం అలవడుతుందని, ఒకరిని చూసి మరొకరు ఎలా అభివృద్ధి చెందాలో ఆలోచిస్తారని చెప్పారు. విద్యార్థుల్లో టెక్నికల్ స్కిల్స్ వెలికితీయవచ్చున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, ఎ.నీలిమ, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందిస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - పెదకూరపాడు

స్థానిక జెడ్‌పి పాఠశాలలో 3, 4, 5 తరగతి విద్యార్థులకు నోట్ పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి అత్తోట మురళి ముకుంద సహకారంతో వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.వెంకటరమణ, ఉపాధ్యాయులు సాంబశివరావు పాల్గొన్నారు.



ఉపకరాణాలు అందిస్తున్న వైద్యులు

ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఫ్లోరోసిస్, ఎముకల సంబంధమైన ఇబ్బందులతో బాధపడే వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎస్.వి.ఎన్ సాయితేజరెడ్డి శుక్రవారం ఉపకరణాలు పంపిణీ చేశారు. వాకింగ్ స్టిక్స్, నెక్ బెల్ట్స్, లంబార్ బెల్ట్స్ అందచేశారు. కార్యక్రమంలో యర్రా వెంకటేశ్వర్లు, అశోక్, కమ్యూనిటీ హెల్త్ అధికారి వైశాలి, ఆరోగ్య కార్యకర్త పి.నాగేశ్వరరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరులకు ఘన నివాళులు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కార్గిల్ యుద్ధం జరిగి 25 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా నరసరావుపేట మండలం కేసానుపల్లి పరిధిలోని ఎంఎఎం గ్రూప్ ఆఫ్ కళాశాలలో అమర జవాన్లకు శు రకవారం నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా మాజీ సైనిక అధికారులు పులి శ్రీనివాసరెడ్డి, గౌస్ మొహిద్దిన్, వై.జయప్రకాష్‌రెడ్డి, రావిళ్ల సత్యనారాయణ, టి.వెంకటేశ్వరరావు, శిశు మందిర్ స్కూల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతారామయ్య, సింధు విద్యా సంస్థల అధినేత కెవి.రామకృష్ణ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలో కార్గిల్ అనేది ఒక జిల్లా అయితే ఈ ప్రాంతం పాకిస్తాన్ చొరబాటుదారులు ప్రవేశించి కొన్ని ప్రాంతాలను వారి ఆధీనంలోకి తీసుకోవడంతో 1999 మేలో యుద్ధం జరిగిందని అన్నారు. భారత సాయుధ బలగాలు పాకిస్తాన్ చొరపాటు దారులను మట్టుపెట్టి తిరిగి ఆ భూభాగాలను మన ఆధీనంలోకి తేవడంతో యుద్ధం జులై 26న 1999న ముగిసిందన్నారు. ఈ యుద్ధంలో చాలామంది సైనికులు ప్రాణాలు కోల్పోయారని, ఆ వీర జవాన్లకు నివాళులు అర్పించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, కళాశాల డైరెక్టర్ డి.శ్రావ్య, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రామారావు, లా కళాశాల ప్రిన్సిపల్ కె.వీరబ్రహ్మం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐగ్రో ఇంటర్ నేషనల్ స్కూల్‌లో

దేశ రక్షణ కోసం కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడి వీర మరణం పొందిన అమర జవాన్లు ప్రతి భారత పౌరునికి స్ఫూర్తిదాయకమని ఐగ్రో ఇంటర్ నేషనల్ స్కూల్ చైర్మన్ పి.వెంకట్, వైస్ చైర్మన్ పి.మురళీ అన్నారు. శుక్రవారం నరసరావుపేట పట్టణ సమీపంలో చిలకలూరిపేట రోడ్డులో ఐగ్రో పాఠశాలలో కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన వీర జవాన్ల చిత్ర పటాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. వెంకట్, మురళీ వర్చువల్‌గా మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో భారత సాయుధ బలగాలకు చెందిన 527 మంది సైనికులు అమరులయ్యారని, నాడు భారత సైనికులు చూపిన తెగువ, చేసిన త్యాగం ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశ రక్షణే ఊపిరిగా పోరాడి అమరులైన జవాన్ల త్యాగం భారత ప్రజలు గురించుకోవాలన్నారు. భారత పౌరులు ఏ దేశంలో ఉన్నా మాతృదేశాన్ని, మాతృభాషను మరవరాదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దివి వెంకట శేషసాయి, వైస్ ప్రిన్సిపల్ యెండ్లూరి చంద్రబాబు, ఏఓ విశ్వనాథ్, సిబ్బంది సాయిబాబా, సాయి, రోటరీ క్లబ్ పబ్లిక్ ఇమేజ్ డైరెక్టర్ షేక్ జిలానీ మాలిక్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో



కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు త్యాగం చేసిన ధీరుల చరిత్ర ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తిరుమల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా నరసరావుపేట మండలంలోని తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ వైవి నారాయణ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు ఫణంగా పెట్టి దేశానికి విజయం అందించిన సైనికుల త్యాగాలు మరువలేనివన్నారు. మంచు పర్వతాలలో 2 నెలల పాటు జరిగిన యుద్ధంలో 527 మంది భారత సైనికులు అమరులయ్యారన్నారు. దేశం కోసం యువత రక్షణ దళాల్లో చేరాలని పిలుపునిచ్చారు. కార్గిల్ యుద్ధం జరిగి 25 ఏళ్లయిన్న సందర్భంగా అమర వీరులను స్మరించుకుంటూ, యుద్ధ సన్నివేశాలు భారత జవాన్ల త్యాగం గురించి విరోచిత పోరాటం గురించి సింధు విద్యా సంస్థల అధినేత కొత్త రామక్రిష్ణ ప్రస్తావించారు. విద్యా భారతి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రతాప సింహ శాస్త్రి మాట్లాడుతూ దేశ యువతకు కార్గిల్ అమరవీరులు స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమం అనంతరం యుద్ధంలో పాల్గొన్న జవానులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, భారతీయ జనతా యువమోర్చా సభ్యులు రాజీవ్‌రెడ్డి, మోర్చా జిల్లా అధ్యక్షులు, మహేష్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రం,ఆధార్ సెంటర్‌లో తనిఖీ

ప్రజాశక్తి-ఈపూరు



మండలంలోని అగ్నిగుండాలలో అంగన్వాడి కేంద్రాన్ని మండలం ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సిహెచ్ రమణారెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. అంగన్వాడి కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం, పిల్లల బరువు హెచ్చుతగ్గులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలు మధ్యాహ్న భోజనం చేస్తుండగా వారితో కలిసి అధికారులు కూర్చుని పిల్లలను ఉత్సాహపరిచారు. అనంతరం ఎంపిడిఒ ఎవి రంగనాయకులు కొచ్చర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సిడిపిఒ బి.అరుణ, అంగన్వాడి సూపర్వైజర్ చిన్నమ్మాయి, అంగన్వాడి కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకరూపాడులోని 6వ అంగన్వాడి కేంద్రాన్ని స్పెషల్ ఆఫీసర్ ధనలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టి, భోజనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రక్తహీనత కలిగిన విద్యార్థులను గుర్తించారా లేదా అని అడిగి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మున్ని, అంగన్వాడీలు పాల్గొన్నారు.



జరీనా సుల్తానాకు సన్మానం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

తెలుగు మహిళ రాష్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన పట్టణానికి చెందిన జరీనా సుల్తానాను కాపు నాయకులు, జనసేన నాయకులు, బిజెపి నాయకులు శుక్రవారం సన్మానించారు. స్థానిక పండరీపురంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తన శ్రమను గుర్తించి పార్టీ పదవిని ఇవ్వడం, తోటి సోదరులంతా అభిమానంతం సత్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు.

తూతూ మంత్రంగా పూడికతీత

- రెండు అడుగుల్లో అరడుగు వ్యర్థాలే తొలగింపు
- ఎక్కడి మురుగు అక్కడే

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలో డ్రెయినేజీల పూడికతీత పనులు తూతూ మంత్రంగా చేపడుతున్నారు. కాల్వల్లో పేరుకు పోయిన మురుగును నామమాత్రంగా తీస్తున్నారు. పట్టణంలో వర్షాకాలంలో వర్షపు నీరు పోయేందుకు వీలుగా డ్రెయినేజీ కాల్వల్లో పేరుకుపోయిన మురుగును తొలగించేందుకు మున్సిపల్ అధికారులు పనులను ఒకరికి కాంట్రాక్టు కింద అప్పగించారు. సదరు కాంట్రాక్టు పొందిన వ్యక్తి తూతూ మంత్రంగా పనులు చేయిస్తున్నారు. 22వార్డు నాగన్నకుంట ప్రాంతాల్లో డ్రెయినేజీ కాల్వలో రెండు అడుగులులోతు మేర పూడిక పేరుకుపోయింది. వర్షాకాలంలో డ్రెయినేజీ కాల్వ పొంగి మురుగునీరు రోడ్లమీద ప్రవహిస్తుండడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో రెండ్రోజుల క్రితం పూడిక తీత పనులు చేపట్టినా ఇంకా అడుగున్నర మేర పూడిక ఉంది. ఇది గమనించిన నాగన్న కుంట ప్రజలు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. పూడిక సక్రమంగా తీయకపోవటం వలన వర్షాకాలంలో మురుగునీటితో ఇబ్బందులు పడాల్సి వస్తోందంటున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ కె.షమీని వివరణ కోరగా పూడిక సక్రమంగా తీయలేదనే విషయం తన దృష్టికి వచ్చిందని, కాంట్రాక్టర్‌తో మట్లాడి పూడిక తీయిస్తామని చెప్పారు.



రోడ్ల మీద ప్రవహిస్తున్న మురుగు నీరు (ఫైల్)



సైనికుల త్యాగాలను గుర్తుంచుకోవాలి

కార్గిల్ విజయ్‌దివస్‌లో అమర జవానులకు నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సైనిక సంక్షేమ కార్యాలయంవద్ద శుక్రవారం జరిగిన కార్గిల్ విజయ్‌దివస్ 25వ వార్షిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. కార్గిల్ యుద్ధం విజయోత్సవ కార్యక్రమంలో ముందుగా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అమర్ జవాన్ స్థూపం వద్ద పుష్పగుచ్చం ఉంచి, రెండు నిముషాలు మౌనం పాటించి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో 527 మంది సైనికులు వీర మరణం పొంది దేశానికి విజయాన్ని అందించారన్నారు. వారి ప్రాణత్యాగాలను, బలిదానాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యం అన్నారు. మన జిల్లా నుండి 16 మంది కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నారని, గుంటూరు ఉమ్మడి జిల్లాలో 52 మంది కార్గిల్ యుద్ధంతో పాటు అంతకు ముందు జరిగిన యుద్ధాల్లో వీరగతి పొందారన్నారు. నేటి యువత సైన్యంలోని వివిధ రంగాల్లో చేరడానికి మహత్తర అవకాశాలు వున్నాయన్నారు. వాటిని వినియోగించుకోవాలన్నారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో మరణించిన సైనికుల గౌరవార్థం వారి కుటుంబ సభ్యులకు శాలువ కప్పి మెమెంటో అందించి సత్కరించారు. అలాగే యుద్ధాలలో జిల్లాకు సంబంధించి వీరగతి పొందిన సైనికుల కుటుంబ సభ్యులతో పాటు, సైన్యంలో పదవీ విరమణ పొందిన సైనికులకు సన్మాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారిణి గుణశీల, డైరెక్టర్ ఆఫ్ సైనిక్ వెల్ఫేర్ బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి, పంచాయితీ రాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ గుఱ్ఱం బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

టిజెపిఎస్‌లో

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక టిజెపిఎస్ కాలేజి, ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ విజయోత్సవ దివస్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సుబేదార్ మేజర్ విజయ్‌మహతి, సాగర్ పటేల్ 25వ బెటాలియన్ నుండి పాల్గొన్నారు. మేజర్ విజయ్ మహతి మాట్లాడుతూ దేశ రక్షణలో ఉండే ఆత్మసంతృప్తి మరెక్కడా దొరకదని చెప్పారు. కళాశాల సెక్రటరీ బ్రహ్మాం మాట్లాడుతూ ప్రజలు నేడు ఉండటానికి బోర్డర్‌లో జవానులు కంటికి రెప్పలా కాయటమే కారణం అన్నారు. ప్రిన్సిపాల్ మేజర్ ఏబిపి మనోహర్ మాట్లాడుతూ క్రమశిక్షణ, దేశభక్తి తత్త్వం, సామజిక సేవా భావాలు



టిజెపిఎస్‌లో మాట్లాడుతున్న విజయ్ మహతి



సెయింట్ ఆన్స్‌లో కార్గిల్ విజయ్‌దివస్‌లో ఎన్‌సిసి క్యాడెట్లు

ఎన్‌సిసి ద్వారా విద్యార్థులకు అలవడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి అధికారి మేజర్ పి.కుమార్ రాజా, లఎన్‌యస్‌యస్ అధికారి ఆర్.జయశైలజ, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో

ప్రజాశక్తి-గుంటూరు : గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో ఎన్‌సిసి క్యాడెట్లు కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ రెవరెండ్ సి.సంధ్య.టి అధ్యక్షతన వహించారు.ఈ సందర్భంగా ఎన్‌సిసి క్యాడెట్లు యుద్ధంలో పాల్గొన్న అమరవీరుల త్యాగం గురించి తెలియజేశారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశ సంరక్షణకు తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ కె.సుస్మిత, ఫిజికల్ డైరెక్టర్ జి.బాలశౌరెడ్డి, ఎన్‌సిసి ఆఫీసర్ సంధ్య, ఐ.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గుంటూరు సిటి : భారత సాయుధ బలగాల ధైర్యసాహసాలకు, ధైర్యానికి, త్యాగాలకు నివాళు లర్పిస్తున్నట్లు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా యుద్ధ నాటి ఘటనలు గుర్తు చేసే విధంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రారంభించారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : పాకిస్తాని ఆక్రమిత పర్వతాల నుంచి పాకిస్తాన్ సైనికులను తరిమికొట్టిన భారత జవాన్ల ప్రతిభ పోరాటాలను ప్రతి భారతీయులు స్మరించుకోవాలని



గుంటూరులో ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

22(ఏ) బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ జె మహేష్ అన్నారు. ఈ సందర్భంగా తెనాలి లింగారావు సెంటర్లో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ నిర్వహించారు. విఎస్ఆర్ కళాశాల మీదుగా కోగంటి శివయ్య పురపాలక పాఠశాల, ఎన్సిఆర్ఎం పాఠశాల వరకూ ఎన్సిసి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి సుధారాణి ఎన్సిసి అధికారులు కె స్వామి, టి వెంకట భాస్కర్, కె అశోక్, ఎన్సిసి పిఐ స్టాఫ్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కార్గిల్ వీర జవానుల వీర గాథలను రాభోయే తరాలకు చెప్పాలంటూ కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ విద్యార్థులకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపు నిచ్చారు. దేశ సరిహద్దులలో పహారా కాస్తున్న వీర జవానుల త్యాగాలు మరువలేనివి అని ఆయన అన్నారు. శుక్రవారం స్థానిక కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో బిజెపి యువ మోర్చా అద్వర్యంలో, ఎన్ సిసి 22 ఆంధ్రా బెటాలియన్, 10 ఆంధ్రా బెటాలయిన్ ల సహకారంతో ఏర్పాటు చేసిన కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన ఆయన విద్యార్థుల నుద్దేశించి ప్రసంగించారు. ఎన్డీఎ ప్రభుత్వం అద్వర్యంలో భారత్ కు సైనిక, ఆయుధ బలం పెరిగిందన్నారు. నూతన విద్యా విధానంతో మోదీ బావి భారత పౌరులకు నూతన ఆవిష్కరణల పట్ల అవగాహన కల్పించారని అన్నారు. కార్యక్రమంలో కెఎల్ యు రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు విసి డాక్టర్ జి.పార్థసారదివర్మ, డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్ రామ్ తదితరులు పాల్గొన్నారు.



ఫాగింగ్ ను పరిశీలిస్తున్న చైర్పర్సన్, కమిషనర్

దోమల నియంత్రణకు డ్రోన్‌తో ఫాగింగ్

ప్రజాశక్తి - తెనాలి


దోమల నియంత్రణకు పురపాలక సంఘం పరిధిలో డ్రోన్ తో ఫాగింగ్ చేపట్టారు. పట్టణంలోని నాల్గవ వార్డు బిసి కాలనీలో శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ పర్యవేక్షణలో ఫాగింగ్ ప్రారంభించారు. అలాగే 23 వ వార్డు లోని కొబ్బరి తోట పరిసరాల్లోనూ ఫాగింగ్ నిర్వహించారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు యాంటి లార్వా స్ప్రే ను డ్రోన్ తో స్ప్రే చేయించినట్లు చైర్ పర్సన్ చెప్పారు. దీనికి శ్రీకారం చుట్టిన హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె హెలెన్ నిర్మల ను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమం లో కమిషనర్ బి శేషన్న, నాల్గవ వార్డు కౌన్సిలర్ ఎ. వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ మాలేపాటి హరి ప్రసాద్, హెల్తాఫీసర్ హెలన్ నిర్మల, శానిటేషన్, మలేరియా విభాగం అధికారులు పాల్గొన్నారు.



ముంపు గ్రామాల బాధితులకు రోటరీ క్లబ్ చేయూత

ప్రజాశక్తి - తెనాలి

పోలవరం ప్రాంతంలో ముంపు బాధితులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేయూతనిచ్చారు. భారీ వర్షాలకు నష్టపోయిన రామాచంద్రాపురం మండలం శ్రీరామ్ గిరి గ్రామస్తులకు అవసరమైన టార్పాలిన్, దోమ తెరలు, నిత్యావసరాలను రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, హైదరాబాద్ జూబ్లీహిల్స్ క్లబ్, తాడేపల్లి క్లబ్, మంగళగిరి క్లబ్బు సంయుక్త ఆధ్వర్యంలో అందించినట్లు రోటరీ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్ ఈదర వెంకట పూర్ణచంద్ చెప్పారు. అక్కడి ప్రజల పరిస్థితులు బాధ కలిగించాయని, పంట పొలాలు, ఇళ్ళు మునిగిపోయి, అడవిలోని గుట్టల మీద, కొండల మీద, తాత్కాలికంగా బొంగులతో గుడిసెలు వేసుకుని తల దాచుకుంటున్నారని, వాటికి కనీసం పైకప్పులు లేవన్నారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ ఎస్ వి రాంప్రసాద్, క్లబ్ అధ్యక్షులు ఈదర శ్రీనివాస్, గాజులు శ్రీనివాస్, రావూరి రమేష్, నల్లూరి వెంకటేశ్వరరావు, సుకుమార్ రెడ్డి పాల్గొన్నారు.



దోస్త్ ఆధ్వర్యంలో ఉపకారవేతనాలు పంపిణీ

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఉన్నత శిఖరాలు అందుకోవాలంటే జీవితంలో ముఖ్యమైన ఘట్టం విద్యార్థి దశ అని గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు నాన్నపనేని నాగేశ్వరావు అన్నారు. దుగ్గిరాలలోని బాలుర ఉన్నత పాఠశాల మరియు కె.ఆర్.ఆర్.ఎం డిగ్రీ కళాశాలలో శుక్రవారం ముగిసిన విద్యా సంవత్సరం లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు దోస్త్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.ఐదువేలు ప్రోత్సాహక ఉపకార వేతనాలు అందించారు. కార్యక్రమంలో జాగర్లమూడి శ్రీనివాస్ ఎం గాంధీ కే జోగేంద్ర ప్రసాద్ బి సోమేశ్వరరావు గూడూరు వెంకటరావు గద్దె రవీంద్ర జంపాల రవీంద్ర శ్రీహరి కాలేజీ ప్రిన్సిపాల్ కే గిరిధర్ రావు హై స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్ శోభా దేవి పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరులకు ఘన నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి

కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవ వేడుకలలో భాగంగా మంగళగిరి ఎక్స్ సర్వీస్ మెన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యం లో మాజీ సైనికులు అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయం నుండి అమర వీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గుంటూరు జిల్లా ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ అధ్యక్షులు మంగళగిరి ఎక్స్ సర్వీస్ మెన్ ఆర్గనైజేషన్ గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావ, మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ షేక్.అలిమ్ భాష, ట్రైనీ డీఎస్పీ భార్గవి కార్గిల్ అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు.

చేనేత పరిశ్రమ సమస్యలను పరిష్కరించాలి

29న కలెక్టర్‌లకు వినతి పత్రాలు

ప్రజాశక్తి-మంగళగిరి : చేనేత పరిశ్రమ కుంటుపడుతూ చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వీటి పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని 29న కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపునిచ్చింది. శుక్రవారం మంగళగిరి సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 48 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టింది కానీ దేశ జనాభాలో 6 కోట్ల మంది ఉన్న చేనేతకు కేవలం 200 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించటం చాలా దారుణం అన్నారు. చేనేతలను కాపాడుతామని చెప్పిన బిజెపి చేనేత రంగాన్ని కనుమరుగు చేయటానికి కంకణం కట్టుకున్నట్లుగా కనపడుతుందని విమర్శించారు. ఈ ప్రభుత్వం రాబోయే బడ్జెట్లో చేనేత పరిశ్రమకు 1000 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.చేనేతపై జిఎస్‌టి పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గజవల్లి వెంకట కష్ణారావు, బత్తూరి మోహనరావు, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు బత్తుల గిరి, దొడ్డి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరిలో నివాళులర్పిస్తున్న మురుగుడు హనుమంతరావు తదితరులు



పొన్నూరులో దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల

ప్రగడ కోటయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి

చేనేతపై కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీ నుండి విముక్తి కలిగిస్తామని మంత్రి నారా లోకేష్ గతంలోనే హామీ ఇచ్చారని, తప్ప కుండా తెలుగుదేశం ప్రభుత్వం హామీలు నెరవేరుస్తుందని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు అన్నారు. శుక్రవారం మంగళగిరి డి.ఆర్.చేనేత కాలనీలో ప్రగడ కోటయ్య దామర్ల రమాకాంత˘రావు మున్సిపల్ హై స్కూల్‌లో పట్టణ తెలుగు నాడు చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రగడ కోటయ్య 109వ జయంతి నిర్వహించారు. ముందుగా హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న ప్రగడ కోటయ్య విగ్రహానికి మంగళగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త నందం అబద్దయ్య, నాయకులు దామర్ల రాజు, తాటిపాముల లక్ష్మ పేరుమాళ్ళు, నందం బాబు రావు, మునగాల విఠల్ రావు,అనుముల శ్రీని వాసరావు పూలమాలవేసి నివాళులర్పించారు. మంగళగిరి పట్టణ పద్మశాలియ బహుత్తమ సంఘం కార్యాలయంలో ప్రగడ కోటయ్య చిత్ర పటానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు సంఘం నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చింతక్రింది కనకయ్య, దామర్ల కుబేర స్వామి, గంజి రవీంద్రనాథ్, రామనాథం పూర్ణచంద్రరావు, జొన్నా దుల బిక్షారావు తదితరులు పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే శంకర్రావు, కదిరి ఎమ్మెల్యే కే వెంకట ప్రసాద్, రాష్ట్ర యువజన కార్యనిర్వహక అధ్యక్షులు ఉప్పాల రాజ్ కిరణ్, కే క్రాంతి కుమార్, పి మహేష్ అక్కినపల్లి బాలయ్య, భాస్కర్, జంజనం వరప్రసాద్ తదితరులు ఘన నివాళులర్పించారు.

ప్రజాశక్తి -పొన్నూరు : చేనేత కార్మికుల సంక్షేమానికి తుది శ్వాస వరకు పాటుపడిన మహనీయుడు ప్రగడ కోటయ్య అని పొన్నూరు ఎమ్మెల్యే, సంఘం డైరీ చైర్మన్ కొనియాడారు. చేనేత బంధు ప్రగడ కోటయ్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలో ప్రగడ కోటయ్య స్మృతి వనాన్ని సందర్శించి పలువురు నివాళులు అర్పించారు. స్థానిక వీవర్స్ కాలనీలోని ప్రగడ కోటయ్య విగ్రహానికి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

కంచర్ల నాగరాజుకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-గుంటూరు



కంచర్ల నాగరాజుకు చెన్నైలోని శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ డాక్టరేట్ ప్రదానం చేసింది. నాగరాజు 'ఎవల్యూషన్ ఆఫ్ న్యూరో సైక్రాటిక్ ప్రాపర్టీస్ ఆఫ్ మెథనోలిక్ ఎకాక్ట్స్ ఆప్ కైటీరియా అరకులేటా ఇన్ బిహేవిరియల్ మోడల్స్ ఆఫ్ మైస్' అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ఇచ్చారు. నాగరాజుకు అదే యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ అనూష గైడ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా నాగరాజుకు పలువురు అధ్యాపకులు, స్కాలర్స్, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

వర్సిటీ రూసా కో-ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ మురళీమోహన్

ప్రజాశక్తి - ఏఎన్‌యు



ప్రొఫెసర్ మురళీమోహన్‌ను అభినందిస్తున్న వర్సిటీ సిబ్బంది

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని రూసా కోఆర్డినేటర్ గా హిస్టరీ విభాగానికి చెందిన ఆచార్య ఎస్.మురళీమోహన్ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఉదయం రూసా కార్యాలయంలో ఇన్చార్జి రిజిస్ట్రార్ జి. సింహాచలం, ఓ ఎస్ డి ప్రొఫెసర్ ఆర్ వి ఎస్ ఎస్ ఎన్. రవికుమార్, యం. త్రిమూర్తి రావు, తదితరులు మురళీమోహన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ రూసా కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కే. సునీత నుంచి మురళీమోహన్ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వీసీ గంగాధర రావుకు ధన్యవాదాలు తెలియజేశారు. విధుల నిర్వహణలో కష్టపడి వర్సిటీ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు, మురళీమోహన్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

వియత్నాం సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ సరస్వతి రాజు అయ్యర్



ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సోషియాలజీ- సోషల్ వర్క్ విభాగం అధ్యాపకులు ఆచార్య సరస్వతి రాజు అయ్యర్ ప్రతిష్టాత్మకంగా వియత్నాంలో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్నారు. డిజిటల్ యుగంలో మానసిక ఆరోగ్యం ఒక ప్రపంచ సమస్య అనే అంశంపై సోషల్ సైన్సెస్ మానవీయ శాస్త్ర ఫ్యాకల్టీ నిర్వహించిన ఈ అంతర్జాతీయ శాస్త్రీయ సదస్సులో సరస్వతి రాజు అయ్యర్ అధ్యక్షత వహించారు. వియత్నాం హూచిమిన్‌లో ఉన్న వాన్ లాంగ్ యూనివర్సిటీలో జరిగిన ఈ సదస్సులో ఆచార్య సరస్వతి రాజు అయ్యర్ భారతదేశంలో పట్టణ మహిళలపై సోషల్ మీడియా ప్రభావం అనే విభాగంలో పరిశోధన పత్రాన్ని సమర్పించారు.



డేటా ప్రాసెసింగ్‌పై విస్తృత పరిశోధనలు అవసరం

ప్రజాశక్తి - ఏఎన్‌యు

భారతదేశం డేటా ప్రాసెసింగ్‌పై చేస్తున్న విస్తృత పరిశోధనలు మరింత వేగవంతం కావాలని ఏఎన్యూ ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే. గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆనాల్గమేషన్ ఆఫ్ నావిగేషన్ ఎర్త్ అబ్జర్వేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీస్ అనే అంశంపై సాంకేతిక సదస్సు ప్రారంభమైంది. సదస్సుకు ముఖ్య అతిథిగా వీసి ప్రొఫెసర్ గంగాధరరావు పాల్గొని మాట్లాడారు. ప్రపంచం మొత్తం డేటా ప్రాసెసింగ్ పై పరిశోధనలు చేస్తున్నాయని, భారతదేశం టెక్స్టైల్, మ్యానుఫ్యాక్చరింగ్, ఎన్విపి, జిపియు ప్రాసెసర్, మ్యానుఫ్యాక్చరింగ్ మీద దృష్టి సారించిందని అన్నారు. గణిత శాస్త్ర నైపుణ్యం అందరూ పెంచుకోవాలని సూచించారు. సెమినార్ డైరెక్టర్ ఆచార్య పి. సిద్దయ్య మాట్లాడుతూ సాంకేతికతలను మెరుగుపరిచి సమ్మేళనం చేయడం ద్వారా ఒక ఆచరణార్థమైన వ్యవస్థయొక్క సామర్థ్యం పెరుగుతుందన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న బి.ఈ. ఎల్ జనరల్ మేనేజర్ డాక్టర్ సిహెచ్ విశ్వనాథన్ మాట్లాడుతూ పరిశ్రమలు ఆశిస్తున్న నైపుణ్యం విద్యార్థులు పొందాలంటే హార్డ్వేర్ టెక్నాలజీ లో వస్తున్న మార్పులపై దృష్టి సారించాలన్నారు. వి ఎస్ ఎల్ ఐ కోర్ టెక్నాలజీ పై సాధన చేసి మెలకువలు పెంచుకోవాలని సూచించారు. బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు ఇంటర్న్షిప్ కొరకు బిఇఎల్ లో అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఎఫ్యాట్రానిక్ అధిపతి డి. రామకృష్ణ మాట్లాడుతూ డిజిటల్ అల్గారిదం డెవలప్మెంట్, గణిత శాస్త్ర ప్రావీణ్యం భవిష్యత్తును అంచనా వేయగల స్మార్ట్ సిస్టమ్స్ మీద అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎఫెక్ట్రానిక్స్ కంపెనీలు ఇంటర్న్ షిప్ కల్పిస్తామని సూచించారు . ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ ఈ. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వివిధ దేశాల శాటిలైట్ సిస్టం, రిసెప్షన్ డేటా ఎనాలిసిస్ చేసే సాంకేతికతలను పుస్తక పఠనం మీద మాత్రమే ఆధారపడకుండా పోటీపడి నేర్చుకోవాలన్నారు. సదస్సుకు వివిధ కళాశాల నుంచి 300 మంది హాజరయ్యారు. సదస్సుకు గౌరవ అతిథులుగా పి .రాఘవేంద్రరావు, ఇన్చార్జి రెక్టర్ ఆచార్య రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఓ ఎస్ డి ప్రొఫెసర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు



జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలైన రోడ్లు, రైలు, విమాన సర్వీసు కనెక్టివిటీ ఉందని, ఔత్సాహిక పారిశ్రామి కవేత్తలు జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ పిలుపునిచ్చారు. శుక్రవారం కలక్టరేట్‌లో డిస్ట్రిక్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగల్‌డెస్క్ పాలసీ చాలా సరళమైందని, పరిశ్రమల స్థాపనకు అత్యంత ముఖ్యమైనదన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉందని, ఇండస్ట్రియల్ ఎస్టేట్స్ ఎక్కువగా వున్నాయన్నారు. పారిశ్రామిక రంగం అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో వున్నాయన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అందిస్తున్న రాయితీలపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా పరిశ్రమల శాఖ అధికారులు విస్తతంగా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సాహవంతులైన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు భాగస్వామ్య పద్దతిలో పరిశ్రమలు పెట్టాలని, దానికి అనుగుణంగా ప్రభుత్వం క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా క్లస్టర్ పెట్టడానికి అవకాశం వుందన్నారు. నిరుద్యోగ యువత పియంఈజిపి క్రింద పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకుంటే మ్యానిఫ్యాక్చర్ యూనిట్‌కు రూ.50లక్షలు, సర్వీసెస్ యూనిట్‌కు రూ.20 లక్షలు మంజూరు చేస్తారని తెలియజేశారు. అలాగే ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం క్రింద దరఖాస్తులను యంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు సర్పంచ్ లాగిన్‌లలో వున్న దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి స్టేజ్ 2కు పంపించాలన్నారు. జిల్లాలో పరిశ్రమల ప్రోత్సాహకాలకు సంబంధించి యంయస్‌యంఈలకు చెందిన 162 క్లైమ్స్‌కు రూ.8.44కోట్లు మంజూరు చేస్తూ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆమోదించారు. పరిశ్రమల స్థాపనకు రెవెన్యూ శాఖ పరిధిలో ఏదైనా భూసమస్యలు ఉంటే తన దష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆర్. వెంకటేశ్వరరావు, పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ యుగంధర్, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూధన రావు, ఏపిఐఏసి జోనల్ మేనేజర్ జీవన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ యం.నారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి బడ్జెట్‌లో కోత తగదు

ఎస్‌ఎఫ్‌ఐ గుంటూరు జిల్లా ప్లీనంలో సిహెచ్ కుమార్



మాట్లాడుతున్న కుమార్

ప్రజాశక్తి-గుంటూరు : విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలో ఉండటం ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.కుమార్ అన్నారు. శుక్రవారం బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో దేశంలోని నిరుద్యోగం, ఆహార కొరత వంటి సమస్యలను పరిష్కరించే విధంగా లేదని అన్నారు. నిత్యావసరాలు, ఇతర పేదలు వినియోగించే అనేక వస్తువులపై పెద్ద ఎత్తున పన్నులు పెంచారని, కానీ వారి సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవట్లేదని విమర్శించారు. గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో భారత దేశం 113వ స్థానంలో ఉందని, సరైన ఎదుగుదల లేని పిల్లలు ప్రతి ముగ్గురిలో ఒకరు దేశంలో ఉన్నారన్నారు. ఆహార కొరతను తీర్చే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. విద్యా, వైద్య రంగాలకు బడ్జెట్ తగ్గించారని తెలిపారు. డబ్ల్యూహెచ్ఓ పేర్కొన్నట్లు ఒక దేశం అభివృద్ధి చెందాలంటే విద్య, వైద్యం, స్త్రీ, పురుష నిష్పత్తి ఎలా ఉంది, పిల్లల్లో సరైన ఎదుగుల ఉందా లేదా, తలసరి ఆదాయం ఎలా ఉంది వంటి అంశాలను ప్రధానంగా పరిశీలిస్తారని, కానీ మోడి ప్రభుత్వానికి ఇవేమీ పట్టట్లేదని అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ కేంద్రబడ్జెట్‌లో విద్యా రంగానికి భారీ కోత విధించారని అన్నారు. ఉన్నత విద్యకు కూడా గతం కంటే నిధులు తగ్గించారన్నారు. టీచర్ పోస్టులు, యూనివర్సిటీ నిధులు తగ్గించారన్నారు. నూతన విద్యావిధానం వల్ల లక్షల మంది బడి బయట ఉన్నారని, వారం దరికీ విద్య అందించటానికి నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. విభజన హామీల్లో భాగంగా రాష్ట్రంలో ఏర్పాటు చేయాల్సిన 11 యూనివర్సిటీలకు కూడా నిధులు తగ్గించా రన్నారు. అనేక యూనివర్సిటీలో అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు లేవన్నారు. విద్యకు రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం, కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం కేటాయి ంచాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి యం.కిరణ్ మాట్లాడుతూ డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్ విధానం రద్దు చేయాలని, మెస్‌చార్జీల బకాయిలు విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన విడుదల చేయాలని, కార్పొరేట్, ప్రైవేటు స్కూల్స్‌లో అధిక ఫీజులు నియంత్రించాలని కోరారు. ప్లీనం ప్రారంభం సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ పతాకాన్ని జిల్లా అధ్యక్షులు ఎస్.కె.సమీర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సుచరిత, నవిత, పవన్‌కుమార్, సుభాష్, యశ్వంత్, భగత్‌సింగ్, భరత్‌చందు, ఆరిఫా పాల్గొన్నారు.

డిజిటల్ యుగంలో మెండుగా ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ప్రపంచం మొత్తం నేడు డిజిటల్ యుగంలో ఉందని ఏఎన్‌యు జర్నలిజం విభాగాధి పతి డాక్టర్ జి. అనిత పేర్కొన్నారు. జర్నలిజం చదివే విద్యార్థులకు బిబిసి న్యూస్ ఛానల్ కలెక్టివ్ న్యూస్ రూమ్ పేరుతో ఉపాధి అవకాశాలు కల్పించే అంశాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం బిబిసి ట్రైనింగ్ అండ్ కల్చరల్ హెడ్ ఇక్బాల్ అహ్మద్ అధ్యక్షతన జరిగింది. డిప్యూటీ మేనేజింగ్ ఎడిటర్ శృతి అరోరా, తెలుగు అసిస్టెంట్ ఎడిటర్ అనిల్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డిజిటల్ యుగంలో బీబీసీ కల్పించే ఇంటర్న్ షిప్ లను వివరించారు. బిబిసి ఇండియా ట్రైనింగ్ స్కీములను ఈ ఏడాదికి ప్రకటిం చిందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువతను ఆకర్షించే విధంగా కెరీర్ అవకాశాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎడిటోరియల్ , నాన్ ఎడిటోరియల్, ప్రొడక్షన్, న్యూస్ రూము విభాగంలో ఎక్కువ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ యువతకు అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత తరుణంలో డిజిటల్, సోషల్ మీడియా, ఫిలిం మేకింగ్, న్యూస్ వెబ్సైట్, క్రియేటివిటీ వంటి రంగాలు విస్తృతంగా అభివృద్ధి చెందుతు న్నాయని వాటిని అందిపుచ్చుకునే క్రమంలో గ్రామీణ యువతకు అవకాశాలు కల్పించేందుకు బీబీసీ ఒక ప్లాట్ ఫాంగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకునే క్రమంలో క్రియేటివిటీ పట్ల ఆసక్తి ఉన్నవారు, స్టోరీలను ఎప్పటికప్పుడు కొత్త విధానంలో చెప్పే వారికి ఎక్కువ అవకాశాలు ఉంటాయన్నారు. దేశంలోని ఆరు ప్రధాన భాషలలో బీబీసీ విస్తృత సేవలను అందిస్తున్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం అంతా డిజిటల్ జర్నలిజం దూసుకుపోతుందని పేర్కొన్నారు. ఇందులో మహిళలకు కూడా తగిన ప్రాధాన్యత కల్పిస్తా మన్నారు. అనంతరం జర్నలిజం విద్యార్థులు లేవనెత్తిన సందేశాల ను నివృతి చేశారు. కార్యక్రమంలో జర్నలిజం అధ్యాపకులు డాక్టర్ కే జ్యోతి ర్మయి, డాక్టర్ జై మధుబాబు, డాక్టర్ ఎన్ మాణిక్యరావు, పరిశోధకులు పాల్గొన్నారు.

